క్లుప్తంగా

అన్నదానం

రామాపురం : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో చెన్నకముక్కపల్లెకు చెందిన నారాయణమ్మ 5వ వర్ధంతి సందర్భంగా కుమారుడు రెడ్డప్పరెడ్డి ఆర్థిక సహాయంతో బండపల్లి దగ్గర గల ప్రేమాలయంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ హరీష్ చంద్ర, దాత కుటుంబ సభ్యులు శోభారాణి, రెడ్డికిషోర్, సుచరిత, మహేశ్వర్‌రెడ్డి, హేమశ్రీ, మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

లక్కిరెడ్డిపల్లె : ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రాజకీయ సిద్ధాంతిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి 30 గుంటూరులో సమావేశాలు జరుగనున్నట్టు వారు విలేకరులకు ఆదివారం తెలిపారు. ఈ తరగతిలో బోధించడానికి నిష్ణాతులైన ప్రొఫెసర్లు, రాజకీయ నిపుణులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అంతేకాకుండా కళా సాంస్కృతిక కార్యక్రమాలకు వందేమాతరం శ్రీనివాస్, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, మాదాల రవి పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

నేడు ఓబులవారిపల్లెకు ప్రభుత్వ విప్

ఓబులవారిపల్లె : మండలంలో నేడు (సోమవారం) ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పర్యటించనున్నట్లు ఆదివారం మండల కన్వీనర్, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తల్లెంవారిపల్లి నూతన ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని వారు కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

గాలివీడు : నేటి నుంచి మూడు రోజులపాటు మండలంలోని చీమలచెరువుపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెలో వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గణపతి పూజ, గంగా నయనము, రక్షాబంధనము, మాతృకాపూజ, కలశస్థాపన తదితర పూజలు, మంగళశారం హోమాలు, గ్రామోత్సవం, బుధవారం వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, కుంభాభిషేకం, సర్వదర్శనం పూజా కార్యక్రమాలను వేద పండితులచే నిర్వహించబడునని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం




వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప హోలిస్టిక్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని ఆసుపత్రి మేనేజర్ డాక్టర్ జె.వి.హరినాథ్ తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో దీర్ఘ కాలిక వ్యాధులైన బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, గుండెకు సంబంధించి ఈసీజీ వంటి వ్యాధులకు సంబంధించి 63 మందికి వైద్యులు డాక్టర్ నావీద్ అహ్మద్, మహమ్మద్‌బాషాలు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

భూ కబ్జాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని పెద్దఓరంపాడు గ్రామంలో దాదాపు 60 ఎకరాల ప్రభుత్వ భూమిని పెద్దఓరంపాడు గ్రామానికి చెందిన ఎ.జయన్న ఆదివారం కబ్జా చేయడానికి యత్నించాడు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు కబ్జాను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ సర్వే నెంబరు 923లో రికార్డు పరంగా ప్రభుత్వ భూమి కలదని, కబ్జాకు పాల్పడిన వారి వద్ద ఆధారాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల సందడి



వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

బి.కొత్తకోట: వేసవి సెలవుల చివరి ఆదివారం కావడంతో పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ సందర్శకులతో కిటకిటలాడింది. గాలి బండ, వ్యూ పాయింట్లు, అటవీ సముదాయం, ప్రకృతి అధ్యయన కేంద్రం వద్ద సందర్శకులు ప్రకృతి అందాలను తిలకించారు. చల్లటి వాతావరణంలో చెట్ల కింద సేద తీరారు. కుటుంబాలతో వచ్చిన వారు విందు వినోదాలతో సందడి చేశారు. వైఎస్సార్, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు చెందిన వారు పెద్ద సంఖ్యలో వచ్చారు.

విద్యార్థుల దశాబ్దాల కల సాకారం

- తల్లంవారిపల్లెకు జెడ్పీ పాఠశాల
- పేద విద్యార్థులకు తొలగనున్న ఇబ్బందులు
- నేడు ప్రారంభించనున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, సీఎం సలహాదారుడు ధనుంజయ్‌రెడ్డి



1956వ దశకంలో నిర్మించిన తల్లెంవారిపల్లె ప్రాథమిక పాఠశాల



తల్లెంవారిపల్లె గ్రామంలో తాత్కాలిక భవనంలో ఉన్నత పాఠశాల

ఓబులవారిపల్లె : మండలంలోని అటవీ శివారు గ్రామాలైన గాదెల, ఎస్టీ కాలనీ, తల్లెంవారిపల్లె, చెంచువారిపల్లె, జీవీ పురం, గాదెల కొత్తపల్లె, దళితవాడలు, నూకనపల్లె తదితర గ్రామాల ప్రజలు తమ పిల్లలకు చదివించాలంటే దూర ప్రాంతాలకు పంపాల్సిందే. అంతేకాకుండా వ్యయంతో కూడుకున్న వ్యవహారం. దీంతో పేద ప్రజలు తమకు అందుబాటులో పాఠశాల ఎప్పుడు వస్తుందా అని సంవత్సరాలుగా వేచి చూస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో కొరముట్ల శ్రీనివాసులు, ధనుంజయ్‌రెడ్డి సహకారంతో తల్లెంవారిపల్లెకు జెడ్పీ పాఠశాల మంజూరైంది. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల ప్రారంభం కానుంది.

విద్యార్థుల కల సాకారం

సీఎం సలహాదారులు ఆర్.ధనుంజయ్‌రెడ్డి కృషితో అటవీ శివారు గ్రామాల ప్రజల కళ సాకారమైంది. తల్లెంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో చదివిన ఆయన తాను చదివిన పాఠశాలను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉన్నత విద్య కోసం దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారని వారికి ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో తల్లెంవారిపల్లె గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా మంజూరు చేయించారు. దీంతో దశాబ్దాలుగా కలలుకంటున్న గ్రామీణ ప్రాంత ప్రజల కళ నెరవేరింది.

అన్ని సౌకర్యలతో ఉన్నత పాఠశాల

గాదెల పంచాయతీ, జీవీ పురం పంచాయతీలోని అన్ని గ్రామాల విద్యార్థులకు అనుకూలమైన తల్లెంవారిపల్లెలో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. దూర ప్రాంత విద్యార్థులకు అనుకూలంగా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. దీంతో కృష్ణంపల్లె, నూకనపల్లె తదితర గ్రామాల విద్యార్థులకు కూడా ప్రయోజనం కలుగనుంది. ఇటీవలే ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పాఠశాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రారంభం రోజునే ప్రభుత్వం ద్వార విద్యార్థులకు విద్యాకానుకను అందజేయనున్నారు.

ప్రారంభించనున్న ప్రభుత్వ విప్,సీఎం సలహాదారు

1956 దశకంలో తల్లెంవారిపల్లెలో ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాఠశాలలోనే చదువుకొనేవారు. బోదకొట్టంలో విద్యార్థులకు చదువులు చెబుతూ వచ్చారు. కాలక్రమేణ తల్లెంవారిపల్లె గ్రామ రైతు అరవ రోషిరెడ్డి హయాంలో పక్కా భవనాన్ని నిర్మించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిలో రాణిస్తూ పాఠశాలకే కాకుండా గ్రామానికి కూడా గుర్తింపు తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఏర్పాటు చేశారు. 2023- 24 విద్యా సంవత్సరానికి ప్రత్యామ్నాయ భవనాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. 164 మంది విద్యార్థులతో సోమవారం పాఠశాలను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, సీఎం సలహాదారుడు ఆర్.ధనుంజయరెడ్డి విద్యాశాఖ ఉన్నత అధికారులు ప్రారంభించనున్నారు.

పేద విద్యార్థులకు ప్రయోజనం



ఉన్నత విద్య కోసం వేలాది రూపాయల ఖర్చు చేయలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు తల్లెంవారిపల్లె ఉన్నత పాఠశాల ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అన్ని గ్రామాలకు అనువైన ఆహ్లాదకరమైన ప్రదేశంలో ఉన్నత పాఠశాల ప్రారంభించడం హర్షనీయం.

\- కొమ్మురు నారాయణరెడ్డి, రైతు, జీవీపురం, ఓబులవారిపల్లె

కష్టాలు తొలిగిపోనున్నాయి



పాఠశాల విద్య కోసం దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. తల్లెంవారిపల్లెలో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థుల కష్టాలు తొలిగిపోనున్నాయి. తమ గ్రామంలోనే ఉంటూ పిల్లలకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

\- అరవ సుధీర్‌రెడ్డి,రైతు, తల్లెంవారిపల్లె

మెరుగైన విద్యా బోధనలు



అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే తల్లెంవారిపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బోధించనున్నాం. ఇప్పటికే ఉన్నత అధికారులు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తాం. ఇందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేశాం. విద్యార్థులు ప్రభుత్వం ద్వార పాఠశాల ప్రారంభం రోజునే విద్యా కానుకను అందజేస్తాం.

\- పద్మజ, ఎంఈఓ, ఓబులవారిపల్లె

ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు



సంబేపల్లె: నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో కుర్నూతల గంగమ్మ

చిన్నమండెం : మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనానికి వచ్చారు. మొక్కుబడులు ఉన్న వారు బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

నల్ల గంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. బంధువులు, మిత్రులతో అమ్మవారిని దర్శించుకొని విందు కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. ఆలయం చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

అంకాలమ్మ జాతరలో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



అమ్మవారిని దర్శించుకుంటున్న కొరముట్ల



రాజంపేట: అమ్మవారి దర్శనానికి వేచిఉన్న భక్తులు

రైల్వేకోడూరు : మండలంలోని మాధవరంపోడులో ఆదివారం అంకాలమ్మ తల్లి జాతర సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులకు గ్రామస్తులు, జాతర కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తనవంతుగా సంపూర్ణ సహకారం అందిస్తుంటానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అమ్మవారి చల్లని చూపు ప్రజలపై తప్పక ఉంటుందన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ రామరాజు ఇంటిలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, మాజీ సర్పంచ్ రామరాజు, మునిచందర్ రాజు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, శివయ్య, తోట శివసాయి, సిహెచ్.రమేష్, సిద్దయ్య, జయన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లెలో మారెమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మారెమ్మకు అభిషేకాలు నిర్వహించారు. మూలమంత్ర హోమాలు చేశారు. మహాపూర్ణహుతి, మహదాశీర్వచనం నిర్వహించారు. పోతులరాజు స్వామికి అలంకరణ పూజ చేశారు. ఉదయం నుంచి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి పొంగళ్లు సమర్పించి, మొక్కుబడులను తీర్చుకున్నారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎంపీపీని ఘనంగా సనాన్మించారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి పాలాభిషేకం

జాతర మహోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించనున్నారు. భక్తులు తమ తమ స్థాయిలో పాలు సమర్పించాలని నిర్వాహకులు కోరారు. పాలపూజలో భక్తులు విరివిగా పాల్గొనాలన్నారు. పురోహితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో జాతర మహోత్సవలను చేపడుతున్నారు.

ముగిసిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : నందలూరు క్రీడా మైదానంలో కుమ్మరపల్లె యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా అరవపల్లెకు చెందిన రైజింగ్ స్టార్స్ జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. మాజీ జెడ్పీటీసీ శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఐకెపీఎస్ అధ్యక్షుడు మస్తానయ్య, మాజీ వార్డు సభ్యుడు తోట శివశంకర్‌లు విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ క్రికెట్ పోటీలలో ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేల నగదును ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీరాములు, కార్య నిర్వాహకులు ఆకుల వెంకటేశు, రంజిత్, దీపు మధు, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, శివకోటి, మున్నా, ప్రవీణ్, రామయ్య, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడాపై చేసిన ఒక్క ఆరోపణను నిరూపించగలరా?

సిద్దవటం : తెదేపా కార్యదర్శి నారా లోకేష్‌కు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత లేదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి మండిపడ్డారు. మండలంలోని భాకరాపేటలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నారా లోకేష్ ఒక్కసారి కూడా ఎమ్మెల్యేగా గెలవలేదన్నారు. టీడీపీ 2014 ఎన్నికల్లో జిల్లాలోని 9 నియోజకవర్గాల్లో ఘోరంగా ఓడిపోయినా.. మేడా సొంత ఇమేజ్‌తో విజయం సాధించారన్నారు. మేడాపై చేసిన ఏ ఒక్క ఆరోపణనైనా నిరూపించగలరా, బహిరంగ చర్చకు మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మండల రైతువిత్ర అధ్యక్షుడు రామిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కాడే రమణయ్య, డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలవలేని లోకేష్ ఎమ్మెల్యేను విమర్శించడమా?

సిద్దవటం : స్థానిక నేతలు రాసి ఇచ్చిన స్క్రిప్టును చదవలేని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రాజకీయాలు అవసరమా అని సిద్దవటం ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి ప్రశ్నించారు. మండలంలోని మాచుపల్లెలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ వ్యక్తుల పేర్లు, గ్రామాల పేర్లు గాని సరిగా చదవలేడన్నారు. ఇక ఆయన రాజకీయ పరిజ్ఞానం ఏపాటిదో ఇట్టే అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యేగా గెలవలేని వ్యక్తి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. అన్నమయ్య డ్యాం తెగినప్పుడు ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే తన సొంత నిధులతో బాధితులను ఆదుకున్నది బహుశా పప్పు నాయుడుకు తెలియదేమోనని సందేహం వ్యక్తం చేశారు. లోకేష్ ఎన్ని డ్రామాల చేసిన వచ్చే ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీదే అని జోస్యం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ : చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు.


సనాతన ఆచారాలను దినచర్యగా ఆచరించాలి



చిన్నారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరూ సనాతన ఆచారాలను దినచర్యగా ఆచరించాలని గీతబోధ గురువులు నారాయణస్వామి, కృష్ణప్రభుదాసులు కోరారు. స్థానిక శ్రీసాయి విద్యాలయ పాఠశాలలో సనాతన వాహిని ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భగవద్గీతపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 40 రోజుల నుంచి మన్నూరులోని యల్లమ్మ ఆలయంలో, నూనివారిపల్లిలోని వినాయకుడి దేవాలయాలలో చిన్నారులకు భగవద్గీతను బోధించినట్లు తెలియజేశారు. ఎంతో ఆసక్తి కనబరిచి శ్లోకాలను నేర్చుకున్న చిన్నారులకు పోటీలు నిర్వహించి, పోటీలలో మొదటి మూడు బహుమతులతోపాటు పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించనట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గీతబోధ గురువులు రమాదేవి, జయమ్మ, సంపూర్ణ, నిర్వాహకులు డాక్టర్ ఎస్ బాలరాజు, డాక్టర్ అనీల్‌కుమార్, డాక్టర్ శ్రీహరి, టి.రమణారెడ్డి, రమణయ్య, బి.సుబ్రమణ్యం, సి.చంద్రమౌళి, ఎ.ఉమాశంకర్, చిన్నికృష్ణ, బద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. మొత్తం 183 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వారిలో 177 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఆరు మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

పెనగలూరు : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి ఎంట్రెన్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 100 సీట్లకు గాను 195 మంది దరఖాస్తు చేసుకోగా 187 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాత పరీక్షకు ఉపయోగించే ఓఎంఆర్ షీట్లను జిల్లా కేంద్రానికి పంపించినట్లు ఆమె తెలిపారు. రాత పరీక్షలో మెరిట్ లిస్టు ప్రకారం సీటు కేటాయించనున్నట్లు వారు తెలిపారు.

లక్కిరెడ్డిపల్లె : 2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి ఆదివారం లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్ష నిర్వహించారు.

ఈ పరీక్షకు 87 మందికి గాను 85 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ చక్రేనాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు తాగునీరు, అన్ని వసతులతోపాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిబిరాలు



గాలివీడు: బహుమతులను అందిస్తున్న గోపినాథ్‌రెడ్డి



ఓబులవారిపల్లె : బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు గ్రంథాలయంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు ఇంగ్లిష్, హిందీ, డ్రాయింగ్, వ్యాసరచనపై పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ బుడిగి శివయ్య, పట్టణ కన్వీనర్ సిహెచ్.రమేష్, రౌఫ్, మందపాటి శంకరయ్యలు హాజరై విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. వారి భవిష్యత్‌కు చుక్కానిలా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారంతో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను మే నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాలను చదవించడం, కథలు చెప్పడం నీతి పద్యాలు చదివించడం, వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు, ఆటల పోటీలను నిర్వహించామన్నారు. సమ్మర్ క్యాంపు ముగింపు రోజు ఆదివారం వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రేడ్ - 3 పంచాయతీ కార్యదర్శి సుప్రజ చేతుల మీదుగా బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు మిట్టపల్లె గోపినాథరెడ్డి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా చిన్నారులకు ఆటపోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ చంద్రనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : పుల్లంపేటలోని గ్రంథాలయంలో వేసవి సెలవులలో నిర్వహించిన శిబిరం ఆదివారంతో ముగిసిందని గ్రంథాలయ అధికారి జయప్రకాశ్ తెలిపారు. ప్రభుత్వం నిర్వహించిన వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు సంబంధించిన పాఠ్యాంశాలు గురించి వివరించామన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాశ్ రాజు, వెంకటరమణ, గ్రామ సభ్యులు మనోహర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని వైకోట గ్రామంలో వేసవి గ్రంథాలయ ముగింపు శిక్షణా శిబిరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు తదితర పోటీలలో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య బహుమతులను అందజేశారు. గ్రంథాలయ అధికారి మధు మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతులను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనజాగృతి సభను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉసురుపాటి బ్రహ్మయ్య

రాయచోటి అర్బన్ : విజయవాడలో నిర్వహించనున్న మాదిగల జనజాగృతి మహాసభను జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీస్ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జూలై 7న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించే జనజాగృతి సభకు మాదిగలంతా పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. రాష్ట్రంతో పాటు దేశంలోని పార్టీలు అన్ని వర్గీకరణ అంశంలో మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న జనజాగృతిని విజయవంతం చేయడం ద్వారా మాదిగలలో ఐక్యతను పాలకులకు చాటిచెప్పాలంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ రాష్ట్ర కో-కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, కో-కన్వీనర్‌గా ఆశోక్‌కుమార్‌తో పాటు పలువురు నేతుల, కార్యకర్తలు పాల్గొన్నారు.